క్లుప్తంగా

సీమ సాహిత్యంపై సదస్సు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న నెల నెలా సీమ సాహిత్యంకార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు జరిగే సదస్సులో ×సజీవ సంప్రదాయంగా వేమన॰ అంశంపై తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్ (శ్రీకాళహస్తి) ప్రసంగిస్తారన్నారు.

వివాహ వేడుకలో మాజీ డిప్యూటీ సీఎం


వధూవరులతో అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నగరంలోని వైఎస్సార్ స్మారక ప్రెస్ క్లబ్‌లో సాక్షిటీవీ రిపోర్టర్ నితిన్ వివాహ రిసెప్షన్‌కు మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్.ఇలియాస్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, కార్పొరేటర్ షఫీ, కోఆప్షన్ సభ్యురాలు బి.మరియ, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రెడ్డి, సాక్షి బ్యూరో బాలక్రిష్ణారెడ్డి, సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాస్ వెన్ను, బ్రాంచి మేనేజర్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: కడప డివిజన్ పరిధిలో ఆదివారం సెలవుదినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కడపటౌన్, చింత కొమ్మ దిన్నె, రిమ్స్, కడప ఈస్ట్ రూరల్, పెండ్లిమర్రి, చెన్నూరు, వల్లూరు, నందిమండలం, ఒంటిమిట్ట, సిద్ధవటం సెక్షన్లలో విద్యుత్ బిల్లులు స్వీకరిస్తారన్నారు. వినియోగదారులు ఈ అవకాశం ఉపయోగించుకుని ఎటువంటి అపరాధ రుసుము లేకుండా విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించవలసినదిగా కోరారు.

వైవీయూలో ఎన్‌ఎస్‌ఎస్ స్వచ్ఛతాహీ సేవ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వ విద్యాలయం ఎస్‌ఎస్‌ఎస్ యూనిట్–9 ఆధ్వర్యంలో క్యాంపస్ నందు శనివారం ముళ్ల కంపలు తొలగించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేశామని, ప్లాస్టిక్ కవర్స్, వేస్ట్ వాటర్ బాటిల్స్ సేకరించి నిప్పు పెట్టామని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

జులై 13న కడపలో బాడీ బిల్డింగ్ పోటీలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 13న కడప నగరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో బాడీ బిల్డర్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ది కడప బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేష్, సెక్రటరీ యూనుస్‌బాషా కోరారు. కడప నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జులై 13వ తేదీన చిన్నచౌకులో గల శ్రీ సాయి శ్రీనివాస గార్డెన్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు.

మరణించిన వారు కూడా యోగాకు అర్హులేనా?

వల్లూరు (చెన్నూరు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి మరణించిన వారు కూడా అర్హులేనా అంటూ వైఎస్సార్‌సీపీ కడప జిల్లా నేతలు ధ్వజమెత్తారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తులకు యోగా కార్యక్రమంలో మంచి ప్రదర్శన చేశారంటూ సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. సచివాలయం–1 పరిధిలోని ఎల్లటూరు షేక్ చిన్నసయ్యద్ (86) ఈ ఏడాది ఫిబ్రవరి రెండో తేదీ మరణించాడు. అయితే ఈనెల 21న యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మంచి ప్రదర్శన చేశారంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ పంపించారన్నారు. విచారించకుండానే ఇలాంటి ధ్రువపత్రాలు పంపడం విడ్డూరంగా ఉందన్నారు.

భక్తి శ్రద్ధలతో మహాయాగం ప్రారంభం

- ఘనంగా శ్రీకృష్ణుని కల్యాణోత్సవం
- తొలిరోజు కొనసాగిన విశేష పూజలు


దశకోటి కృష్ణమంత్ర జప మహాయాగ ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కడప సెవెన్‌రోడ్స్: కడప బ్రాహ్మణ వీధిలోని ఉత్తరాది మఠంలో శనివారం దశకోటి కృష్ణమంత్ర జప మహాయాగం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఆధ్యాత్మిక విద్యా ప్రతిష్టానం, మాళిగి విద్యా నిధి ఆచార్య ఆధ్వర్యంలో మైసూరు రామచంద్రచార్, ఎం.విదానిధి ఆచార్, పాండురంగచార్, శ్రీనిధి ఆచార్‌లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక కల్యాణం కోసం ఏర్పాటు చేసిన ఈ మహాయాగంలో తొలిరోజున ఉదయం గోపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, ప్రధాన దేవతా ప్రతిష్టాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి జరిపారు.

ఘనంగా శ్రీకృష్ణుని కల్యాణ మహోత్సవం

కార్యక్రమంలో భాగంగా సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ పరమాత్మ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు కల్యాణ క్రతువు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తబృందం సభ్యులు నరహరి, గుండారావు, ఆనంద తీర్థ, మహిళా మండలి ప్రతినిధులు వేదవతి, లత భట్, రామ అగ్నిహోత్రి తదితరులు పూజలను పర్యవేక్షించారు. మహాయాగం, కల్యాణోత్సవ కార్యక్రమాలను నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.


కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలి


పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో 50 వార్డుల్లోనూ విజయం సాధించి మేయర్ పదవి కైవసం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్‌డి.విజయ జ్యోతి పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరా భవన్‌లో విలేకరులతో శనివారం ఆమె మాట్లాడుతూ కడప నగర వార్డు సభ్యుల పదవీ కాలం 13 మార్చి, 2026తో ముగియనున్నట్లు తెలిపారు. మరో సుమారు తొమ్మిది నెలల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున నేతలంతా ఇప్పటినుంచే నగర ఎన్నికలపై దృష్టిపెట్టాలని సూచించారు. వార్డుల వారీగా సమీక్ష నిర్వహిస్తూ, పార్టీ బలాన్ని పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దేశ భక్తుడు చివరి శ్వాస వరకు రాజ్యాంగాన్ని రక్షించేందుకు పోరాడతారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, ప్రసాద్‌గౌడ్, రహంతుల్లా ఖాన్, షేక్ నీలం, రఫీఖాన్, సుశీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీవీ.నరసింహారావు సేవలు మరువలేనివి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్‌డి.వి జయజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ.నరసింహారావు జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1991 నుంచి 1997 వరకూ ఆరేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. ఆయన చేసిన ఆర్థిక సంస్కరణలు దేశాభివృద్ధిని మలుపు తిప్పాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరాజుద్దీన్, ప్రసాద్‌గౌడ్, రహంతుల్లాఖాన్, షేక్ నీలం, రఫీఖాన్, సుశీల్ కుమార్, మామిళ్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్, ఎస్‌ఆర్‌బీసీలకు తక్షణం నీరివ్వాలి

– రెడ్యం వెంకటసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్: శ్రీశైలం జలాశయం నుంచి కెసీ కెనాల్, ఎస్సార్‌బీసీ, వెలుగోడు రిజర్వాయర్లకు నీరిచ్చి ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో 841 అడుగులకు చేరితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీరు ఇవ్వవచ్చన్నారు. నిబంధనల మేరకు శ్రీశైలంలో 854 అడుగులకు నీరు చేరిన వెంటనే కేసీ కెనాల్, ఎస్‌ఆర్‌బీసీ, వెలుగోడులకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ 867 అడుగులకు చేరినా కూటమి ప్రభుత్వం నీరు విడుదల చేయకపోవడం రైతాంగ వ్యతిరేక చర్య అని విమర్శించారు. తక్షణమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీరు వదిలి గోరుకల్లు, అవుకు, గండికోట, మైలవరం తదితర రిజర్వాయర్లను నింపాలన్నారు. వెలుగోడు జలాశయాన్ని నింపి ఎస్సార్–1,ఎస్సార్–2తోపాటు బ్రహ్మం సాగర్ జలాశయాన్ని నింపాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజోలు జలాశయం నిర్మాణానికి రూ.1357.10 కోట్లు కేటాయించి అగ్రిమెంట్ చేశారని, 2021 మార్చిలో పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించించారన్నారు. అనంతరం గత ఎన్నికల్లో రాజోలు జలాశయం నిర్మిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సింగమాల వెంకటేశ్వర్లు, ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా లలిత


వీసీ నుంచి పత్రం అందుకుంటున్న డాక్టర్ లలిత

కడప ఎడ్యుకేషన్: జెరియాట్రిక్ కౌన్సెలింగ్‌పై అడ్వాన్స్ కోర్సు మాడ్యూల్‌ను సిద్ధం చేయడానికి ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీలో సభ్యురాలిగా యోగి వేమన విశ్వ విద్యాలయం సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ కె.లలిత ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (ఎన్.ఐ.ఎస్.డి) సంస్థ జెరియాట్రిక్ కౌన్సెలింగ్ కోసం సమగ్ర కోర్సు పాఠ్యాంశాలు, మాడ్యూళ్లను అభివృద్ధి చేసేందుకు చైర్మన్ తోపాటు ఆరుగురు సభ్యులు గల స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో వైవీయూ నుంచి డాక్టర్ లలిత పనిచేయనున్నారు. ఇప్పటికే జాతీయ నైపుణ్య చట్రాలకు అనుగుణంగా కంటెంట్ రూపొందించడం, అధ్యయన సామగ్రి, అభ్యాస వనరులు, అంచనా పద్ధతులను ఆమె సిఫార్సు చేస్తారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కుల సచివులు ఆచార్య పి.పద్మ, సైకాలజీ విభాగాధిపతి డా.వి.లాజర్ ఆమెను అభినందించారు.

12 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

కడప అర్బన్: కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడి రిమాండ్‌లో ఉన్న షేక్ అక్బర్ అలీ అనే దొంగను కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఒకరోజు కస్టడీలోకి తీసుకొని విచారించారు. చిన్నచౌక్ సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాజరాజేశ్వర్ రెడ్డి దొంగను విచారించి 8 తులాల బంగారు నగలను రికవరీ చేశారు. దీంతో ఇప్పటి వరకు 12 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లయింది. ఎస్‌ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలిసిన వివరాల మేరకు కడప చిలకల బావి ప్రాంతానికి చెందిన షేక్ అక్బర్ అలీ ఎలక్ట్రీషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతుండేవాడు. ఈనెల 7వ తేదీ దొంగను అరెస్టు చేసి నాలుగు తులాలు బంగారు నగలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇంకా పలు కేసుల్లో విచారించేందుకు ఒక రోజు కస్టడీకి జడ్జి అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో దొంగను విచారించారు. తాజాగా 8 తులాల బంగారు నగలను రికవరీ చేశారు. నిందితుడి నుంచి ఇప్పటి వరకు 12 తులాల బంగారు నగలు రికవరీ చేశారు.

ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలలో రాణించాలి


పుస్తకాలను అందజేస్తున్న ఆర్‌జేడీ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: పోటీ పరీక్షల్లో రాణించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు కాంపిటేటివ్ పుస్తకాలను అందిస్తోందని ఇంటర్ విద్య ఆర్‌జేడీ శ్రీనివాసులు అన్నారు. కడప ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ తోపుదుర్తి జ్ఞానేశ్వరి అధ్వర్యంలో శనివారం పోటీ పరీక్షల మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలతోపాటు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు శ్రీరాములురెడ్డి, రామసుబ్బయ్య, చంద్రమౌళి, యోగీశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్, రాజాతో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష


మోడల్ పరీక్ష రాస్తున్న యువ న్యాయవాదులు

కడప అర్బన్: భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జ్ అన్నమయ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ఉపాధ్యక్షులు ఏ.ఉమాదేవి ప్రకటించారు. శనివారం కడప న్యాయవాదుల సంఘం భవనం(బార్)లోజూనియర్ సివిల్ జడ్జ్ మోడల్ పరీక్షలకు 25 మంది యువ న్యాయవాదులు హాజరయ్యారని తెలిపారు. మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో నిర్వహించిన పరీక్షలో వంద మార్కులకు గానూ ఎం.మీనాక్షి 95, బి.జుబేదా 92, ఎం.స్పందన 91, కే. సునీత 85, ఎస్. ప్రవల్లిక 84, ఎస్.అస్మతియా 83 మార్కులు సాధించారని ఐఏఎల్ నాయకులు ప్రకటించారు. అంతకుముందు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తక్కువ మార్కులు వచ్చాయని ఎవరు నిరుత్సాహపడకూడదని, పట్టుదలతో మరింతగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంపత్‌కుమార్, మునికుమార్‌రెడ్డి , ఆర్.జగదీశ్వర్ రెడ్డి, కె.సూర్యనారాయణరెడ్డి, అర్చన, సోని, రమ్య, గీత పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి


డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నిబంధనలు పాటించని ఫార్మసీ, బీఎస్సీ, ఎంఎల్‌టి, బిపిటి, ఫార్మా–డి, బీఫార్మసీ, డిప్లొమా ఫార్మసీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు కోరారు. డీఎంహెచ్‌ఓ నాగరాజును శనివారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులతో తరగతులు బోధిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలరూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. మెడికల్ విద్యలో ఫార్మసీ, ల్యాబ్ టెక్నాలజీ తదితర కోర్సులకు ప్రాక్టికల్ మెథడ్ ముఖ్యమైందన్నారు. ప్రొద్దుటూరులోని లక్ష్మీ వెంకటేశ్వర, శ్రీనివాస ఫార్మసీ కళాశాలలో సీనియర్ విద్యార్థులతో తరగతులు బోధిస్తున్నారని ఆరోపించారు. వంద పడక గదుల ఆస్పత్రిలోనైనా విద్యార్థులకు ప్రాక్టీస్ ఇప్పించాలని, ఇదేమీ లేకుండా కరపత్రాలు కొట్టించి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పారామెడికల్ బోర్డు, హెల్త్ యూనివర్సిటీ అధికారులు విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అఖిరానందన్, తేజ, నగర ఉపాధ్యక్షుడు మస్తాన్, అశోక్, నాయకులు చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో దాగుడుమూతలు


కొప్పర్తి చెరువు మునక ఆక్రమిత భూమిలో శనివారం మళ్లీ తిరిగి బోర్డును పాతుతున్న సిబ్బంది

చింతకొమ్మదిన్నె : మండలంలో కోట్లాది రూపాయల విలువైన భూములపై ఆక్రమణదారులు విచ్చలవిడిగా బరితెగిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చింతకొమ్మదిన్నె తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఆక్రమణ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతడం .. ఆక్రమణదారులు అర్ధరాత్రులు తొలగించడం, తిరిగి పాతడం... మళ్ళీ తొలగిస్తుండటంతో అధికారులు ఏకంగా కేసులు పెట్టాల్సిన స్థాయికి వెళ్తోంది. అధికారులపైన ఆక్రమిత భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చేయకుండా తీవ్ర వత్తిడులు చేయిస్తున్నట్లు సమాచారం. అధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఖైదీల సంక్షేమం కోసం నిరంతర కృషి

కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారంలో నిరంతరం ఖైదీల సంక్షేమం కోసం కృషి చేస్తుంటామని కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఖైదీల నిత్య అవసరాలకు సరిపడే విధంగా సబ్బుల తయారీ నాలుగు రకాలుగా జరుగుతోందన్నారు. కడప కేంద్ర కారాగారంతో పాటు రాష్ట్రంలోని వివిధ కేంద్ర కారాగారాలకు సబ్బులను ఇక్కడి నుంచే తయారు చేసి పంపిస్తామన్నారు.

ఇక్కడున్న స్టీల్ ఫ్యాక్టరీలో దాదాపు 80 మంది ఖైదీలు పనిచేస్తారన్నారు. అలాగే బ్రిక్స్ తయారీలో ఐదుగురు, టైలరింగ్‌లో 40 మంది, పెట్రోల్ బంక్‌లో 12 మంది, క్లీనింగ్ బ్యాచ్‌లో 60 మంది, నాలుగు రకాల సబ్బుల తయారీ (సుధర్) ఫ్యాక్టరీలో దాదాపు 80 మంది మొత్తం 300 మందికి పైగా ఖైదీలు వివిధ కేటగిరీలలో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. పనిచేసినందుకు ఖైదీలకు రోజుకు స్కిల్ ఉన్నవారికి రూ.200, సెమీస్కిల్ ఉన్నవారికి ఒక కేటగిరీలో రూ.180, సెమీ ఓపెన్ జైలు వారికి రూ.160 చెల్లిస్తామన్నారు. ఆ డబ్బులను వారి బ్యాంకు ఖాతాలలో భద్రపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జిల్లా పేరు మార్పు



కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద వైఎస్సార్ జిల్లాగా ఉన్న పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చారు. ఇదివరకూ వైఎస్సార్ జిల్లా అని పిలిచేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చిన విషయం విదితమే. ఒక గేటును మూసివేసి ఆఘమేఘాలపై మార్చే పనులు చేస్తున్నారు.

సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

రోళ్లబోడు బీటులో కూంబింగ్


సిద్దవటం రేంజి రోళ్లబోడు బీటులో కూంబింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం: రేంజి పరిధిలోని రోళ్లబోడు బీటులోని సమస్యాత్మక ప్రదేశాల్లో, ఎర్రచందనం స్మగ్లర్ల కోసం కడప ఎర్ర చందనం ఫ్లయింగ్ స్క్వాడ్, సిద్దవటం రేంజి అటవీ సిబ్బంది శనివారం కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌ఓ మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఎర్రచందనం సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ బి. కళావతి, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ ఎస్ఓ శ్రీకాశిరెడ్డి, ఎఫ్‌బీఓలు గాయత్రి, ఆదివిశ్వనాథ్, మధు, పెంచల్‌రెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.





థైరాయిడ్‌తో కంటి వ్యాధులు


కావ్య మాధురి బెజ్జంకి

కడప కోటిరెడ్డి సర్కిల్: థైరాయిడ్ వ్యాధి కంటిని ప్రభావితం చేస్తుందని ఎల్‌వీపీఈఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి అన్నారు. ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రాంగణంలో శుక్రవారం థైరాయిడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనగానే జుట్టు రాలడం, శరీర బరువుకు సంబంధించిన సమస్యలు, శక్తి స్థాయిలు, హార్మోన్ల అసమతుల్యత ప్రభావాలు మాత్రమే మనకు తెలుసునన్నారు. హైపర్ థైరాయిడిజం(ఓవర్ యాక్టివ్ థైరాయిడ్) ఉన్న వారిలో కంటి వ్యాధి సర్వసాధారణం అని, సాధారణంగా ఉన్నప్పుడు కూడా ఇది సంభవించే అవకాశం ఉందన్నారు. కంటి వ్యాధిలో, శరీర రోగ నిరోధక వ్యవస్థ పక్కదారి పట్టి కళ్లచుట్టున్న కొవ్వు మరియు కండరాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. కళ్ళు ఉబ్బినట్టుగా లేదా పొడుచుకు వచ్చినట్టుగా కనిపించడం (పెద్ద కళ్ళు అని పొరపాటు పడేంతగా), కనురెప్పల ఉపసంహరణ, కళ్ళు పూర్తిగా మూసుకోవడంలో ఇబ్బంది కలగడం (లాగోఫ్తాల్మోస్), అసౌకర్యంగా లేదా ఒత్తిడిగా అనిపించడం వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలను ఆశించవచ్చు అన్నారు. థైరాయిడ్ వ్యాధి ఉన్నవారిలో కంటిలో అసాధారణ మార్పులు గమనించినట్లయితే, ముందుగానే వైద్య సహాయం తీసుకోవడం చాలా మంచిదన్నారు.

యువకుడు అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నచౌక్ మెయిన్‌రోడ్ రెడ్డికాలనీ రోడ్ నెం–2 ఎదురుగా నివాసం వుంటున్న ద్రాక్షా సుబ్బరామయ్య కుమారుడు ద్రాక్షా ఉదయ రామచంద్ర (19) అనే యువకుడు ఈనెల 27న టిఫిన్ సెంటర్ మూసివేసిన తరువాత మధ్యాహ్నం 1:00 సమయంలో ఎక్కడికో వెళ్లిపోయి తిరిగి రాలేదని, శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేశాడని, ప్రస్తుతం సెలవులు కావడంతో తన తల్లిదండ్రులతో పాటు టిఫిన్ సెంటర్‌లో సహాయకంగా వుండేవాడు. గత 10 రోజులుగా దిగులుగా వున్నాడని, ఏం జరిగిందని తల్లిదండ్రులు అడిగారు. ఈ క్రమంలోనే ఎటో వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

